సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం ▪ 22 ▪ ఆగస్టు ▪ 2025



కదం తొక్కిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలు కదం తొక్కారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాలను పెంచి జీవితాలను కాపాడాలని కోరారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం ఆందోళనలు చేశారు. ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో ఇలా మానవ హారం నిర్వహించారు.

'గుంటూరులో ఎంపికైన కానిస్టేబుళ్లు 23న హాజరుకావాలి'

శ్రీకాకుళం క్రైమ్: గుంటూరులో ఇటీవల మన జిల్లా నుంచి ఎస్‌సీటీ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు హాజరై ఉద్యోగాలకు ఎంపికైన సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఈ నెల 23న ఆ జిల్లా పోలీసు కార్యాలయానికి తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు అక్కడి ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ గురువారం ప్రకటన జారీ చేశారు. అభ్యర్థులు 10 గంటలకు హాజరై దరఖాస్తుతో జతపర్చిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, అటెస్టెడ్ జిరాక్సు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

'దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘ ప్రతినిధులు

సోంపేట: రాష్ట్రం ప్రభుత్వం ఇటీవల తొలగించిన దివ్యాంగ పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని దివ్యాంగుల సంఘం హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శులు మల్లారెడ్డి భాస్కర్, దశముఖ రమేష్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 1458 మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. మళ్లీ అప్పీలు చేసుకోవాలని దివ్యాంగులను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజక వర్గాల్లోని దివ్యాంగులకు ఉపకరణాలు అందలేదని, ప్రభుత్వం స్పందించి ఉపకరణాలు అందేలా కృషిచేయాలన్నారు. సమావేశంలో పోకల మోహనరావు, ఎం.పీతాంబరం తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి జానపద పాటల పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మందస మండలం బహడపల్లిలో శుక్రవారం జిల్లా స్థాయి సామాజిక జానపద పాటల పోటీలు నిర్వహించనున్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో పోటీలను విజయవంతం చేయాలని కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, ప్రతినిధి రాపాక ధనరాజు,కార్యదర్శి లబ్బ రుద్రయ్య కోరారు. అలాగే అదే గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను అదే రోజు ఉదయంలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440861442 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

రణస్థలం సబ్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రణస్థలం: రణస్థలం సబ్ స్టేషన్‌ను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫీడర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు సమస్యలు రాకుండా విద్యుత్ అందించాలని సూచించారు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కమ్మసిగడాం పరిధిలో 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా వేసిన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరుపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న బంటుపల్లి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ పీవీ సూర్య ప్రకాశ్, జిల్లా ఎస్ఈ కృష్ణమూర్తి, డీఈ పైడి యోగేశ్వరరావు, ఈఈ బయ్యంనాయుడు, రణస్థలం ఏడీ ఎం.రాజేష్, ఏఈ జి.తిరుపతిరావు ఉన్నారు.

మూడు గంటల పాటు గేటు బంద్



కేదారిపురం-పురుషోత్తపురం ఎల్‌సీ గేట్ వద్ద మరమ్మతు పనులు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం-పురుషోత్తపురం మధ్యనున్న రైల్వే ఎల్‌సీ గేట్‌ను రైల్వే సిబ్బంది మూడు గంటల పాటు మూసివేశారు. ట్రాక్ మరమ్మతుల పేరిట ముందస్తు సమాచారం లేకుండా గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గేట్ మూసి వేయడంతో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు.

అంతర్ జిల్లా బదిలీలకు పచ్చ జెండా

శ్రీకాకుళం: రాష్ట్రంలో ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు బదిలీ కావాలనుకునే ఉపాధ్యాయులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువరించారు. స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీల్లో మాత్రమే బదిలీలు జరుపుతామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం వారు పనిచేస్తున్న జిల్లా, బదిలీ కావాల్సిన జిల్లా వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. కొత్త ప్రొఫార్మాలో ఈ వివరాలను పొందుపరిచి డీఎస్సీ ఏపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. వేరొక జిల్లాకు బదిలీ అయినప్పుడు ప్రస్తుత జిల్లాలోని సీనియార్టీని కోల్పోయి, అక్కడ చివరి ర్యాంకుల్లో చేరుతారు. ఈ ఏడాది జూలై 31 నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

కష్టాలు వినిపించవా.. కన్నీళ్లు కనిపించవా..?





ఇంకా తలుపులు తీయని ఎంపీడీఓ కార్యాలయాల ముందు ఎందరో దివ్యాంగులు దీనంగా కనిపిస్తున్నారు. తలుపులు తీస్తారో లేదో తెలీని రైతు సేవా కేంద్రాల వంక అన్నదాతలు ఆశగా చూస్తున్నారు. దివ్యాంగులకు ఆధారమైన పింఛన్ తీసేసి మళ్లీ దరఖాస్తు చేసుకోమని సర్కారు చెబుతోంది. అన్నదాతకు అవసరమైన ఎరువులు అందించకుండా ప్రభుత్వం లెక్కలను సమాధానంగా వినిపిస్తోంది. నిజానికి వీరిద్దరికీ ఇంటి వద్దనే సేవలు అందించే వీలుంది. కానీ పాలకులు మాత్రం 'అవసరం నీదైనప్పుడు తిరగాల్సిందే..' అన్న మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కర్షకుడిని కదిపితే కష్టాలు వినిపిస్తున్నాయి. దివ్యాంగుడిని పలకరిస్తే కన్నీళ్లు కనిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం కరకు గుండె కరగడం లేదు.

● కనికరమే లేదా..!

- రద్దవుతున్న దివ్యాంగుల పింఛన్లు
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

నరసన్నపేట:

ఇంటి నుంచి బయటకు రావడానికి కష్టపడే దివ్యాంగులు ఇప్పుడు ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల వీరికి ఈ కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు 1400 మంది పైచిలుకు దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తీసేసింది. ఇంకా చాలా పింఛన్లపై వేటుకత్తిని వేలాడదీసింది. దీంతో దివ్యాంగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పింఛన్ రద్దు చేస్తున్నట్లు నోటీసులు వస్తుండడంతో తమ బాధను ఎవరికి చెప్పాలో తెలీక తీవ్ర యాతనకు గురవుతున్నారు.

కాళ్లు, చేతులు పనిచేయని వారు, పక్షవాతానికి గురైన వారు, మానసిక దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరీక్షిస్తుంటే చూస్తున్న వారు కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నారు. నెలకు రూ.6వేలు పింఛన్ వస్తుంది కదా అని ఆనందపడేలోపే పింఛన్లను నిర్దాక్షిణ్యంగా తీసేస్తుండడంతో ఎవరిని కదిపినా కన్నీళ్లే కనిపిస్తున్నాయి.

అర్హత లేకపోయినా అనేక మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారని భావిస్తున్న కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్టిఫికెట్లకు రీ వెరిఫికేషన్ చేయించింది. పింఛన్లు ఎన్ని తగ్గిస్తే అంత మంచిది అని డాక్టర్లకు స్పష్టమైన సూచనలు చేసింది. దీంతో వేల మంది పింఛన్లు కోల్పోతున్నారు. రీ వెరిఫికేషన్‌కు నానా అవస్థలు పడ్డాం. ఇప్పుడు మళ్లీ ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేయడానికి పాట్లు పడుతున్నాం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17 వేల మందికి నోటీసులు?

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 31502 మందికి దివ్యాంగ పింఛన్లు ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క దివ్యాంగ పింఛన్ కొత్తగా ఇవ్వకపోగా 30 మండలాల్లో 17 వేల మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం. వీరందరికీ సెప్టెంబరు పింఛన్ కట్ అయ్యే అవకాశం ఉంది. ఓ వైపు నోటీసులు ఇస్తూ మరోవైపు మళ్లీ దరఖాస్తు చేసుకోండి అని చెబుతుండడంపై దివ్యాంగులు మండిపడుతున్నారు.

నా పింఛన్ తీయకండి



నాకు రెండేళ్లుగా దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఒక కాలు, చేయి పూర్తిగా పనిచేయదు. అయినా నా పింఛన్ తీసేశారు. ఇంత కక్ష మాపై ఎందుకు..? స్వయంగా పరిశీలించి చూడవచ్చు కదా. నేను బయటకు రావాలంటే ఇద్దరి సాయం అవసరం. రీవెరిఫికేషన్, మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి ఎన్ని అవస్థలు పడాలో.

– పిల్ల చిన్నబాబు, ఉలకాం

నేను దివ్యాంగురాలిని కాదా..?



నన్ను చూడండి. నేను దివ్యాంగురాలిని కాదా. 2017లో డాక్టర్లు 81 శాతం వైకల్యం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. అది బోగస్ అంటే ఎలా..? పింఛన్ రాకపోతే నా తల్లితండ్రులకు నేను మరింత భారమవుతాను.

– గొండు శారద, లింగన్నాయుడుపేట, జలుమూరు మండలం



నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయం వద్దకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన దివ్యాంగులు

అర్హులను తొలగించడం అన్యాయం



ఎన్నో ఏళ్లుగా దివ్యాంగ పెన్షన్ అందుకుంటున్న వారిని అనర్హులంటూ తొలగించడం అన్యాయం. రూ.6వేలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు జాబితాలో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేస్తున్నారు. నిజంగా అనర్హులైతే తొలగించడం తప్పు లేదు, కానీ అర్హులను తొలగించడం అనేది చాలా అన్యాయం.

– దున్న బాలకృష్ణ, పలాస నియోజకవర్గం, వైఎస్సార్ దివ్యాంగుల విభాగ అధ్యక్షుడు

● యూరియా.. ఎక్కడుందో చెప్పండయ్యా..!

- జిల్లాలో తీవ్రమవుతున్న యూరియా కొరత
- ఆర్‌ఎస్‌కేలు, ఎరువుల దుకాణాల్లో అందుబాటులో లేని పరిస్థితి
- చేతులెత్తేస్తున్న వ్యవసాయ శాఖ
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

నరసన్నపేట శ్రీకాకుళం పీఎన్ కాలనీ: నిన్న మొన్నటి వరకు అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా చూశారు. వెద పద్ధతిలో సాగు చేస్తున్న వారు, ఉభాలకు సిద్ధమైన వారంతా వరుణుడి కరుణ కోసం నిరీక్షించారు. ఇప్పుడు అంతే ఆశగా యూరియా కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. దేవుడి దయతో నాలుగు జల్లులు కురవడంతో శ్రావణంలోనైనా పొలాలకు జీవం వచ్చింది. ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు ఒక విడత ఎరువులు అందించాల్సి ఉంటుంది. కనీసం యూరియా అయినా ఇస్తే వరి పిలకలు పోసి దుబ్బు కడుతుంది. కానీ ఇంతటి కీలక దశలో ఎరువులు లభించక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడంతో యూరియా కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ధరలకు రెక్కలు..

మొదటి ఎరువులో డీఏపీ, పొటాష్, యూరియా కలిసి వేయాలి. చాలా మంది రైతులు ఈ మోతాదు కాకుండా యూరియా వేసి పంటను కాపాడుకుంటారు. కానీ ఈ యేడు యూరియా కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం నుంచి సరఫరా అవసరం మేరకు లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద కూడా నిల్వలు నిండుకున్నాయి. కొద్ది మంది వ్యాపారుల వద్ద ఉన్న యూరియా ధరకు రెక్కలు వచ్చాయి. అవసరం బట్టి యూరియా బస్తా రూ. 350 నుంచి రూ. 400 వరకూ విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటికి రూ. 270 లకే యూరియా వచ్చేదని ఇప్పుడు ఏమిటీ కష్టాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అంచనాలు వేయలేదా..?

- జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 1.50 లక్షల హెక్టార్లలో వరి సాగుకు నిర్ణయించారు. సుమారు 26వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. అయితే 16,500 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.
- ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట మండలాల్లో వరి సాగుకు కావాల్సినంత ఎరువులు అందించడం లేదు.
- వాస్తవానికి ఖరీఫ్‌కు ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎరువుల అంచనాలు పంపించడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా రైతులకు అందించాల్సిన ఎరువులకు ముడిసరుకు చైనా, రష్యా వంటి దేశాల నుంచి రావాల్సినప్పటికీ తెప్పించడంలో విఫలమయ్యారు.
- జిల్లాలో ఎరువుల కొరతను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బస్తా రూ.400కి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న అరకొర ఎరువులు రైతు సేవా కేంద్రాలకు కాకుండా కూటమి నాయకుల ఇళ్ల వద్ద ఉంచుకుని తమకు అవసరమైనన్ని దాచుకుని మిగిలిన వాటిని ఆ పార్టీ వర్గీయులకే అందిస్తున్నారు.

గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు



రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. ఎకరాకు 20 కిలోలు సరఫరా చేస్తే ఎలా..?

– కనపల శేఖరరావు, రైతు, పోతయ్యవలస

ఇలాగైతే కష్టం



యూరియా దొరక్క రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు బస్తాలు కంటే అధికంగా లభించడం లేదు. రైతు సేవా కేంద్రాల వద్ద నిల్వలు లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం చేయడం కష్టం.

– పోలాకి నర్సింహమూర్తి, రైతు, బడ్డవానిపేట



నరసన్నపేట మండలం గుండవల్లిపేట వద్ద డీఏపీ చల్లుతున్న రైతు

మంత్రి అచ్చెన్నను విచారించాల్సిందే..

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: కూటమి పాలన అవినీతికి కేంద్ర బిందువులా మారిందని, కోట్ల రూపాయల స్కాం చేసేందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెగబడ్డారని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ సమయన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను దోపిడీకి సాధనాలుగా మలుచుకోవడం సరికాదన్నారు. వ్యవసాయ పరికరాల కొనుగోళ్లలో కమీషన్ల కోసం అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజాస్వామ్యానికే మచ్చ అని తెలిపారు. ఒత్తిడి, వేధింపులు తట్టుకోలేక ఆగ్రోస్ జీఎం రాజమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవడం మంత్రి పేషీలోని అవినీతికి నిదర్శనమని ఆయన అన్నారు. మంత్రి, ఓఎస్డీపై నిఘా సంస్థలు విచారించాలన్నారు. మంత్రిపై ఆరోపణలు చేస్తూ ఓ ఉన్నతాధికారి ప్రభుత్వానికి లేఖ రాయడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. మంత్రి నిర్వాకంతో కూటమి ప్రభుత్వ పరువు బజారులో పడిందన్నారు. సీఎం చంద్రబాబు ఈ విషయంలో తన ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

సంక్షోభంలో సాగు..

రాష్ట్రంలో వ్యవసాయశాఖ తీవ్ర సంక్షోభంలో కూరు కుపోయిందని తమ్మినేని మండిపడ్డారు. వానలు ఆలస్యమయ్యాయని, సాగు ప్రారంభించిన వారికి సరిపడా విత్తనాలు, ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మార్కెట్‌లో ఎరువులు లభించడం లేదన్నారు. సబ్సిడీతో అందించాల్సిన ఎరువులు కూట మి నేతల ఆధీనంలోని ప్రత్యేక గోడౌన్లకు వెళ్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు లేవన్నారు.

పింఛన్‌దారుల కుదింపు అన్యాయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4,50,000 మంది అర్హులైన వారిని పింఛన్ల జాబితా నుంచి తొలగించారని, ఇది అన్యాయమని అన్నారు. మానవతా కోణంలో ఆలోచించి, తొలగించిన లబ్ధిదారులందరినీ తిరిగి పింఛన్ల జాబితాలో చేర్చేలా పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు.

బతుకులు తెల్లారిపోయె..



మృత్యు దేవత దారి కాచింది. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి తిరిగిన ఇద్దరిని రోడ్డు ప్రమాదం రూపంలో మింగేసింది. కూతురి సర్టిఫికెట్ల కోసం వెళ్లిన నాన్న ప్రయాణాన్ని ఆఖరి ప్రయాణంగా మార్చేసింది. వేకువజామున రోడ్డుపై నడుస్తున్న వ్యక్తి బతుకు తెల్లారిపోతుంటే ఆ ప్రమాదానికి సాక్షిగా నిలిచింది. చదవలేక, చదువుల ఒత్తిడి భరించలేక పోతున్న ఓ విద్యార్థిని అమాంతం తనతో తీసుకెళ్లిపోయింది. ఒకే రోజు ఐదు ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో ఆయా ఊళ్ల కళ్లు చెమ్మగిల్లాయి.

-10లో

దివ్యాంగుల సమస్యలపై 25న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

టెక్కలి: దివ్యాంగుల సమస్యలపై ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఎ.వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వం చేసిన దివ్యాంగుల పింఛన్ల తొలగింపు, సదరం రీవెరిఫికేషన్‌లో ఇబ్బందులు తదితర అంశాలపై నిర్వహిస్తున్న ఈ ధర్నాకు జిల్లాలో దివ్యాంగులంతా తరలిరావాలని ఆయన కోరారు.

వసతి గృహంలో 22 మందికి వైరల్ జ్వరాలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న కరజాడ పీహెచ్‌సీ వైద్యులు నాగలక్ష్మి

మెళియాపుట్టి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాల ని కరజాడ పీహెచ్‌సీ వైద్యులు నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎన్‌పీ పండా అన్నారు. గురువారం మండలంలోని పెద్దమడి బాలుర గిరిజన సంక్షేమ వసతి గృహంలో జ్వరాలు ఉన్న విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. 22 మంది విద్యార్థులకు వైరల్ జ్వరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎవరికీ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు లేవని నిర్ధారించామన్నారు. వసతి గృహంలోని వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించారు. అనంతరం కార్యదర్శి శివాజీ, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు అధ్వర్యంలో వసతి గృహం పరిసర ప్రాంతాల్లో దోమలమందు స్ప్రే చేయించారు.

వినాయక మండపం పెడుతున్నారా..?

- అనుమతులు తప్పనిసరి
- గణనాథుని మండపాల అనుమతులకు సింగిల్ విండో సిస్టమ్
- ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేకంగా హెచ్‌టీటీపీఎస్:జీఎఎన్‌ఇఎస్‌హెచ్‌యూటీఎస్‌ఎవి.ఎన్‌ఇటీ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టిందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు చేరాక పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది ఓ బృందంగా ఏర్పడి ఆ ప్రదేశాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. వెబ్‌సైట్‌లో అప్లికేషన్ స్టేటస్‌లో దరఖాస్తుదారుని ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే నో అబ్జక్షన్‌కు సంబంధించి నిబంధనలతో కూడిన క్యూఆర్‌కోడ్ డౌన్‌లోడ్ అవుతుందని, నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తక్షణమే మంజూరవుతుందన్నారు.

ఆదాయమే పరమావధా..?

- శ్రీముఖలింగంలో సంప్రదాయాలకు విరుద్ధంగా హుండీ ఏర్పాటు
- భక్తులు విన్నవించుకున్నా పట్టించుకోని అధికారులు



ప్రధాన ఆలయంలో ఉన్న హుండీలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం దక్షిణ కాశీగా పేరొందింది. ఇక్కడ స్వామిని దర్శించుకునేందుకు దేశ నలుమూలలు నుంచి భక్తులు, విదేశాల నుంచి కూడా యాత్రికులు వస్తుంటారు. అయితే ఎంతో చరిత్ర, విశిష్టత ఉన్న ఉన్న ఈ దేవాలయంలో దేవదాయ శాఖ అనాలోచిత నిర్ణయాలు భక్తుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ఆదాయమే పరమావధిగా ఆలయ అధికారులు వ్యవహరిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. ఎక్కడైనా శైవ దేవాలయాల్లో శివలింగం(స్వామివారు)కి దగ్గరలో కొన్ని అడుగులు దూరంలో నందిని ప్రతిష్టిస్తారు. పూజలు, అభిషేకాలు, దర్శనాలు అర్చనలు తదితరవి నిర్వహించే సమయంలో ముందుగా నందిని పూజించి తర్వాత శివునికి అభిషేకం చేస్తారు. శివునికి నందికి మధ్యలో ఎవరూ అడ్డంగా రాకూడదు. ఇది శాస్త్ర ప్రమాణం. అలాంటిది కేవలం ఆదాయమే ధ్యేయంగా ప్రధాన దేవాలయంలో స్వామికి నందికి మధ్యలో మూడు చోట్ల నాలుగైదు హుండీలు ఏర్పాటు చేశారు. దీనిపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈఓకు విన్నవించామని, అయినా చర్యలు తీసుకోలేదని విశాఖకు చెందిన ఓ భక్తుడు తెలిపాడు. దీనిపై ఈఓ టి.వాసుదేవరావును వివరణ కోరగా హుండీలు తొలగిస్తానని తెలిపారు.

క్లుప్తంగా

కళాఉత్సవ్ పోటీలకు ఆహ్వానం

గార: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న బాలుర, బాలికలు, ఉపాధ్యాయ యాజమాన్యాలను కళాఉత్సవ్-2025 పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు వమరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్ గురువారం తెలిపారు. 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, సంప్రదాయ కథ చెప్పడం, దృశ్య కళలు వంటి పోటీలను సెప్టెంబర్ 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని, వివరాలకు 7702391639, 9000726375 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ యువతకు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో షెడ్యూల్డ్ కులాల యువతీ యువకులకు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం తెలిపారు. ప్రధాని ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజేవై)లో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరం కింద జిల్లాకు చెందిన 10 మంది(పురుషులు-5, మహిళలు-5) అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డులతో పాటు కనీసం ఏడాది లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

సైబర్‌సెల్ నిపుణులకు వర్క్‌షాపు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఐటీకోర్, సైబర్‌సెల్ పోలీసులకు ఉబెర్ బేటా డిస్‌క్లోజర్ పాలసీపై విశాఖపట్నం కైలాసగిరి పోలీస్ గెస్ట్‌హౌస్‌లో గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశాల మేరకు విశాఖ రేంజి పరిధిలోని జిల్లాలకు చెందిన 36 మంది పోలీసులు హాజరయ్యారు. నేర సంఘటనల విచారణలో మొబైల్ లొకేషన్ ఆధారంగా నేరస్తులను గుర్తించడంలో ఉబెర్ డేటా ప్రాముఖ్యతను వివరించారు. లీగల్ ప్రాసెస్, డేటా రిక్వెస్ట్, అందుబాటులో ఉండే సమాచార రకాలు, ప్రైవసీ పరిరక్షణ వంటి అంశాలపై చర్చించారు. జిల్లా నుంచి ఐటీకోర్, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సైబర్ బృందం శరత్‌చంద్ర, గిరి, సుధీర్ తదితరులు హాజరయ్యారు.

కార్మికుల పొట్ట కొట్టవద్దు


ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి విధుల్లో ఉన్న వారిని తొలగించడం సరికాదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కిడ్నీ రోగుల కోసం ఉద్దానం ప్రాంతంలో సుమారు రూ.700 కోట్లు వెచ్చించి మేఘ సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించి వంశధార నుంచి తాగునీటిని తెప్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణకు డబ్బులు కేటాయించకపోవడంతో 1997 నుంచి ఉద్దానం మంచి నీటి పథకంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ వచ్చిన 105 మంది కార్మికులకు మేఘ సంస్థ తొలగించిందని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత సంస్థ ద్వారా మరల కార్మికులను ఉద్దానం ప్రాజెక్ట్‌లో చేర్చుకోవాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

పాగురు తీతపై హర్షం


ప్రొక్లెయినర్‌తో పొగురు తీయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు సముద్రంలో ఉప్పుటేరు కలిసిన చోట ఇసుక మేటలు వేయడంతో బూర్జపాడు పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయిన విషయం విదితమే. రైతులు పడుతున్న ఇబ్బందులపై 'పొగురు తెచ్చిన చేటు' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రొక్లెయినర్ సహాయంతో పొగురు తీత పనులు చేయించారు. పంట పొలాల్లో ఉన్న వరద నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలో కలవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈ నేపథ్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం సత్కరించారు. మేలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మేలో సాధించిన రూ. 2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ.4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె.శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వీరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ సమక్షంలో సత్కరించారు.

గణపతి దేవా.. మా గోడు వినవా..!


శ్రీకాకుళం కుమ్మరివీధిలో ఇంటి అరుగుపైనే గణపతి విగ్రహాలు తయారుచేస్తున్న కళాకారుడు

- ఇబ్బందుల్లో మట్టి గణపతి విగ్రహాల తయారీదారులు
- స్థలాభావం, వర్షాలతో ఇక్కట్లు
- ప్రత్యేక షెడ్లు కేటాయించాలని వినతి

శ్రీకాకుళం కల్చరల్ :

మట్టినే నమ్ముకుని దేవుడి విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్న కళాకారులకు పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా సంప్రదాయ మట్టితో తయారు చేసే వినాయక విగ్రహాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శ్రీకాకుళం మహిళా కళాశాల రోడ్డులోని కుమ్మరివీధి, పెద్దమార్కెట్టు వెనుక ఉన్న కుమ్మరివీధి, బలగ ప్రాంతంలో కళాకారులు స్థలాభావ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి వినాయక కమిటీలు ఇక్కడి నుంచి విగ్రహాలను తీసుకెళ్తుంటాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రాంతంలో వర్షాలు సమయంలో ఇబ్బందిపడకుండా విగ్రహాలను భద్రపరిచే అవకాశం లేకపోవడంతో కళాకారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.


టార్పాలిన్‌ల కింద విగ్రహాల తయారీ

పెరిగిన తయారీ వ్యయం..

వినాయక విగ్రహం తయారు చేసేందుకు అవసరమైన మట్టి, గడ్డి గతంలో ఉచితంగా లభ్యమయ్యేది. ఇప్పుడు వాటి లభ్యత తక్కువ కావడంతో కొనుగోలు చేయాల్సి వస్తోందని తయారీదారులు చెబుతున్నారు. ప్రస్తుతం ట్రాక్టరు మట్టి కొనుగోలు చేయాలంటే రూ.2వేలు నుంచి రూ.3వేల వరకు ఖర్చు అవుతోంది. దానిపై గడ్డి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. ఇంకా రంగుల కోసం ఖర్చు కలుపుకొని ఒక బొమ్మ తయారీకి రూ.500 నుంచి రూ.3 వేలు వరకు ఖర్చు అవుతోంది. దీనిపై వారు తయారీ కూలి వేసుకొని అమ్మితే వారు పడిన కష్టానికి నష్టం లేకుండా ఉంటుంది. ఈ సీజన్‌లో కుటుంబ సభ్యులంతా తయారీలో పాలుపంచుకుంటారు.

షెడ్లు అవసరం..



తాతముత్తాల నుంచి బొమ్మలు తయారు చేస్తున్నాం. 30 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నాను. ఇంట్లో బొమ్మలు పెట్టడం వల్ల నిద్ర పోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం మాకోసం ఈ మూడు నెలలకైనా ఒక చోట షెడ్లు కేటాయిస్తే బాగుంటుంది.

– పి.రాజేశ్వరరావు, విగ్రహ తయారీదారుడు, బలగ


బొమ్మలతో నిండిపోయిన ఇల్లు

ఇంట్లోనే తయారీ..

ఈ సీజన్‌లో ఇంట్లోనే బొమ్మలు తయారు చేస్తుంటారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దీటుగా ఆకర్షణీయంగా మట్టి బొమ్మలు చేసేందుకు కుమ్మర్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు చదువుకున్న యువకులు కూడా ముందుకు వచ్చి వాటిని నేటి తరాన్ని ఆకర్షించేలా బొమ్మలు రూపొందిస్తున్నారు.

అద్దె భవనాల్లో..

బొమ్మల తయారీకి షెడ్లు అవసరం ఉంది. విగ్రహాలు పెద్దఎత్తున చేయాల్సి ఉంటుంది. దీంతో అధిక సంఖ్యలో బొమ్మలు తయారు చేసి వర్షానికి తడవకుండా ఉండేందుకు ఇళ్లు తాత్కాలికంగా అద్దెలకు తీసుకుంటారు. మూడు నెలల ముందు నుంచి అద్దెకు తీసుకొని బొమ్మల తయారీ మొదలుపెడతారు. ఏడాదిలో వినాయక చవితికి, దసరా సందర్భంగా బొమ్మలు తయారు చేసి అమ్ముతుంటారు. వాటిని తయారు చేసేందుకు ప్రత్యేక షెడ్లు వేయించాలని తయారీదారులు కోరుతున్నారు. అవి లేకపోవడంతో తాము ఉంటున్న ఇంట్లోనే ఉంచాల్సి వస్తోందని చెబుతున్నారు. రుణాలు సైతం మంజూరు చేయాలని విన్నవిస్తున్నారు.

ప్రభుత్వాన్ని కోరాం..



బొమ్మలు చేసుకోడానికి స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. వచ్చే ఏడాదైనా ఈ అవకాశం కల్పించాలి. వర్షాలు వస్తే బొమ్మలను కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నాం. టార్పాలిన్ కప్పుకొని, అద్దె ఇళ్లలో ఉంచాల్సి వస్తోంది.

– వెంకటరావు, తయారీదారుడు, కుమ్మరివీధి, శ్రీకాకుళం

ఒత్తిడిని అధిగమించేందుకే క్రీడలు

అరసవల్లి: విధి నిర్వహణలో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న విద్యుత్ ఉద్యోగులకు బ్యాడ్మింటన్ పోటీలు ఉపశమనం ఇస్తాయని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. గురువారం స్థానిక శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 వరకు జరిగే పోటీలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టీవీఎస్ సూర్యప్రకాష్, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి, డివిజనల్ ఈఈ పైడి యోగేశ్వరరావు, కార్యదర్శి మహంతి ప్రభాకరరావు, స్పోర్ట్స్ ఆఫీసర్ వడివేలు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, జేఏఈ సనపల వెంకటరావు, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు. కాగా తొలిరోజు పోటీల్లో ఆతిథ్య శ్రీకాకుళం జట్టు బాపట్లపై గెలుపొంది నెల్లూరు జట్టుతో జరిగిన పోరులో ఓటమి పాలైంది. కాగా, సర్కిల్ కార్యాలయం వద్ద సీఎండీ పృథ్వీతేజ్, డైరెక్టర్ సూర్యప్రకాష్‌లు మొక్కలు నాటారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్

బంగారం గొలుసు చోరీ

సారవకోట: తొగిరి గ్రామానికి చెందిన బల్ల లక్ష్మణరావు(71) మెడలో నుంచి బంగారం గొలుసును దుండగులు తెంచుకుపోయారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. లక్ష్మణరావు కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంతకు గురువారం ఉదయం వెళ్లాడు. సరుకులు కొనుగోలు చేసిన అనంతరం స్వగ్రామం వచ్చేందుకు ఆటో ఎక్కాడు. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు వృద్ధుడ్ని మాటల్లో పెట్టి ముప్పావు తులం బంగారం గొలుసు చోరీ చేశారు. దీనిని గమనించని వృద్ధుడు వడ్డినవలస వద్ద ఆటో దిగి గ్రామానికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి చూశాక గొలుసు చోరీకి గురైందని గుర్తించి సారవకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పాత నేరస్తుల ఫోటోలు చూపించగా నిందితుల ఫొటోలను వృద్ధుడు గుర్తించాడు. ఆటో డ్రైవర్ సైతం మహిళా నేరస్తులను గుర్తించాడు. ఈ మేరకు వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

రెండు కేజీల గంజాయితో యువకుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఉత్తరప్రదేశ్‌కి చెందిన అనూజ్‌కుమార్ రెండు కేజీల గంజాయితో పట్టణ పోలీసులకు పట్టుబడిన ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక సర్కిల్ పోలీస్ కార్యాలయం ఆవరణంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఈ యువకుడు రేణిగుంటలో ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. ఒడిశాకు చెందిన గంజాయి సరఫరాదారుడు సాగర్‌తో పరిచయం ఏర్పడింది. రేణిగుంటలోనే గంజాయి వ్యాపారం చేసే అమిత్ జైస్వాల్ అలియాస్ అమిత్‌చౌదరితో గంజాయి సరఫరాకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 18న అనూజ్ ఒడిశాలో 2.070 కేజీల గంజాయిని కొనుగోలు ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. కార్యక్రమంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి తగ్గి.. జీవితంపై విరక్తి కలిగి..

- ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఘటన
- స్వగ్రామం ఫరీదుపేటలో విషాద ఛాయలు


నరసింహనాయుడు మృతదేహం

క్రైమ్ కార్నర్

ఎచ్చెర్ల/వేంపల్లె : వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ సెకెండియర్ చదువుతున్న ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన గురుగుబిల్లి నరసింహనాయుడు (17) ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం వేకువజామున వసతి గృహం బాత్‌రూమ్‌లో కిటికీకి నరసింహనాయుడు ఉరి వేసుకుని ఉండటాన్ని తోటి విద్యార్థులు గమనించి సిబ్బందికి సమాచారం అందించగా వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. విద్యార్థి మృతితో ఫరీదుపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏం జరిగిందో..

నరసింహనాయుడు తండ్రి అప్పలనాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి రాజు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. సోదరి శ్రావ్య కుప్పిలి ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. టెన్త్‌లో 576 మార్కులు రావడంతో ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. అక్కడ వసతి చాలకపోవడంతో ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో వీరికి తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో చురుగ్గా ఉండే విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో అర్థం కావడం లేదని, మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని తల్లి చెబుతోంది. అనంతరం హుటాహుటిన ఇడుపులపాయ బయల్దేరివెళ్లింది.

ట్రిపుల్ ఐటీ ఇష్టం లేక..

నరసింహనాయుడుకు చదువులో మంచి పట్టుంది. పీయూసీ ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించాడు. అయితే ట్రిపుల్ ఐటీలో చదవడం ఇష్టం లేనట్లు తెలిసింది. తాను నర్సింగ్ చేయాలని అనుకుంటున్నట్లు తోటి విద్యార్థులతో చెప్పేవాడు. చదవడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకుంటానని చెబుతుండేవాడని తెలిసింది. విద్యార్థి నాలుగు రోజులుగా ముభావంగా ఉండేవాడని తోటి విద్యార్థులు డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విద్యార్థి సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు. కాగా, విద్యార్థి మృతి పట్ల విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు మృత్యువాత
- దుప్పిలపాడులో విషాదఛాయలు


ఘటనా స్థలంలో మృతదేహాలు


అప్పన్న(ఫైల్)


గంగయ్య(ఫైల్)

టెక్కలి రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణస్నేహితులు దుర్మరణం పాలైన ఘటన కోటబొమ్మాళి మండలం శ్రీపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం దుప్పిలపాడుకు చెందిన సబ్బి అప్పన్న (35) హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొద్ది రోజుల కిందటే స్వగ్రామం వచ్చాడు. గురువారం అత్తవారి గ్రామమైన పాకివలస వెళ్లాడు. అక్కడ స్నేహితుడు పిట్ట గంగయ్య(32)తో కలిసి సమీపంలోని తర్లిపేటలో ఉన్న దాబాకు వెళ్లారు. భోజనం చేశాక తిరిగి పాకివలస వస్తుండగా శ్రీపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. హెల్మెట్లు లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మృతదేహాలను శవపంచనామ నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అప్పన్నకు భార్య లావణ్య, పిల్లలు ప్రియాంక, హారిక, మణికంఠ ఉన్నారు. గంగయ్యకు భార్య వాణిశ్రీ, పిల్లలు నిఖిల్, దీక్షిత్ ఉన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలియడంతో కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శాసనపురి వెంకటరావు (ఫైల్)

పలాస: పలాస లేబరుకాలనీలో నివాసముంటున్న శాసనపురి వెంకటరావు(59) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరావు బుధవారం ఉదయం శ్రీకాకుళంలోని తన కుమార్తె చదువుకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం వెళ్లాడు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో స్వగ్రామం గొప్పిలి వెళ్లడానికి బెండిగేటు నుంచి టెక్కలిపట్నం వెళ్తుండగా మోదుగులపుట్టి వద్ద బైక్ అదుపు తప్పింది. తలకు బలమైన గాయాలు కావడంతో కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో 108లో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కాశీబుగ్గ ఏఎస్ఐ ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం


గోవిందరాజులు (ఫైల్)

రణస్థలం: లావేరు మండలం బుడుమూరు కూడలి సమీపంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు పక్కన నడుస్తున్న బొద్ద గోవిందరాజులు (66)ను శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని స్వగ్రామం విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం బక్కన్నపాలెం. బుడుమూరులోని కుమార్తె ఇంటికి పది రోజుల కిందట వచ్చాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లి రోడ్డు పక్కన నడుస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఏఎస్సై ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

మొద్దునిద్ర వీడి.. డిగ్రీ ప్రవేశాలకు రెడీ

- ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెల్లడి
- ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నాలుగు నెలలుగా విద్యార్థులను క్షోభకు గురిచేసిన ప్రభుత్వం

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర వీడింది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై నాలుగు నెలలుగా విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేసింది. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కళ్లు తెరిచింది. కొత్త విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.


డిగ్రీ చదువుతున్న విద్యార్థులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

- 2025-26 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ ప్రవేశాల కాలేజియేట్ ఎడ్యుకేషన్ వెల్లడించిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ రూ.300, ఎస్సీ/ఎస్టీలు రూ.200 నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.
- విద్యార్థులు ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఈ నెల 24 నుంచి 28 వరకు ఎంపికచేసుకునే కాలేజ్‌తోపాటు ఎంచుకున్న కోర్సులకు వెబ్ ఆప్షన్‌కు గడువు విధించారు.
- ఈ నెల 31న విద్యార్థులకు సీట్ల కేటాయింపు
- సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి తరగతులు మొదలు

నాలుగు నెలలుగా ఎదురుచూపులు

వాస్తవానికి డిగ్రీ విద్యా విధానంపై కూటమి ప్రభుత్వం నాలుగు నెలలుగా డైలమాలో పడింది. సింగిల్ మేజర్ విధానాన్ని మార్పులు చేస్తామంటూ హడావుడి చేసి మరలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానానికే జై కొట్టింది. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులను డిగ్రీ అడ్మిషన్లు పొందేందుకు అర్హులుగా నిర్ణయించారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 103 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 15 ప్రభుత్వ, 88 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 28 వేల సీట్లు ఉన్నాయి. కొన్నేళ్ల కిందట జిల్లా నుంచి 20 వేల వరకు సీట్లు నిండేవి. గత ఏడాది ఈ సంఖ్య పది వేలకు పడిపోయింది. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వ కళాశాలల్లో సైతం గతంలో పోలిస్తే ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల్లో ప్రవేశాలు చాలా వరకు తగ్గిపోయాయి. దీంతో కొన్ని సబ్జెక్టుల కాంబినేషన్ కోర్సులు మూసివేసే దిశగా ఉన్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉండటంతో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. బైపీసీ విద్యార్థులు నీట్, ఫార్మసీ వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

26తో గడువు పూర్తి..



డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తులు చేసుకోవాలి. ఈ నెల 26తో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగుస్తుంది. కాలేజీల గుర్తింపుతోపాటు, అక్కడి పరిస్థితులు, వసతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీని పరిగణనలోకి తీసుకుని కాలేజీలను వెబ్‌ఆప్షన్‌లో ఎంచుకోవాలి.

– డాక్టర్ కణితి శ్రీరాములు, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఐడీ కళాశాల) ప్రిన్సిపాల్

సెప్టెంబర్ 1 నుంచి క్లాసులు..



ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారులు సూచనల మేరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రవేశాలు, సీట్లు కేటాయింపు జరుగుతుంది. ఈ నెల 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్‌కు ఛాన్స్ ఉంది. 31న సీట్ల కేటాయింపు, సెప్టెంబర్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

– డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

వ్యక్తికి దేహశుద్ధి

టెక్కలి రూరల్: స్థానిక పెద్దబ్రాహ్మణవీధికి చెందిన యోగి అనే వ్యక్తి అదే వీధిలో ఉంటున్న మహిళను గురువారం సెల్‌ఫోన్‌లో అసభ్యకరంగా చిత్రీకరించడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల వినతి మేరకు సదరు వ్యక్తికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు.